# మనసు పొరల్లో...

"..దిల్ హైకి మాన్‌తానహీ.. ఏ బేకరారీ.. క్యోం హెూ రహీ హై.. ఏ జాన్‌తాహీనహీ..."

సన్నటి గొంతుతో కూనిరాగం తీస్తున్న రోజా మొహంలోకి ఒక్కసారిగా చిరాకు తోసుకొచ్చింది. చేతిలోని పుస్తకాన్ని పెద్ద శబ్దంతో మూసేసి కుర్చీలో వెనక్కి వాలింది.

కాసేపు అసహనంగా కదిలి మళ్ళీ ముందుకి వంగింది. ఎదురుగా వున్న కంప్యూటర్ మీద అర్థం పర్థం లేని అక్షరాలన్నీ టైప్ చేసి, అది "కీ" అంటూ అరుస్తుంటే చిన్నగా నవ్వుకోసాగింది.

మరో కంప్యూటర్ దగ్గర కూర్చుని సీరియస్‌గా వర్క్ చేసుకుంటూన్న ప్రియ ఆ శబ్దానికి తలెత్తి చూసింది.

రోజా అల్లరి గమనించి "ఏమిటే ఆటలు!" అంది మందలింపుగా.

"మరి నాకు బోర్ కొడుతోంది. ఇంకా ఎంతసేపు కూర్చోవాలి!" బుంగమూతి పెట్టింది రోజా.

"అయిపోయింది. ఇంకో పది నిమిషాలు..." ప్రియ మాటలు పూర్తికాకముందే గఁయ్ మంది రోజా. "ఆఁ. ఫైవ్ థర్టీ నుంచీ యిదేమాట చెప్తున్నావ్. ఇపుడు సిక్స్ థర్టీ అయింది. ఆఫీస్‌లో అందరూ వెళ్ళిపోయారు మనం తప్ప."

ఒక్క క్షణమే ఆ కోపం. మళ్ళీ మూడ్ మార్చేసుకుని "ఏయ్ ప్రియా! నీకోమంచి పాట చెప్పనా! బ్యూటిఫుల్ భావం వుందోయ్ అందులో" అని అడిగింది హుషారుగా.

"ఏమిటే! నువ్విలా డిస్టర్బ్ చేస్తే నేను వర్క్ ఎలా చేస్తాను!" విసుక్కుంది ప్రియ.

"ప్లీజ్. ఈ ఒక్కటి విను. నిజంగా నాకు చాలా నచ్చింది."

"ఏం అక్కర్లేదు" ఖచ్చితంగా చెప్పింది ప్రియ. "అసలే వర్షం వచ్చేట్టుంది. త్వరగా వెళ్ళకపోయాం అంటే "చిటపటచినుకులు పడుతూ వుంటే" అని పాడుకోవాలి యిద్దరం"

"అబ్బ. మంచి పాట గుర్తు చేశావోయ్. పాట బాగానే వుంటుంది కానీ మనిద్దరం కలిసి పాడితే అంత బాగుండదేమో కదా!" అల్లరి అంతా మాటల్లో కూరేసి అమాయకంగా అడిగింది రోజా.

"ఇడియట్. ఇంకోమాట మాట్లాడావంటే చంపేస్తాను" కోపంగా అరిచింది ప్రియ.

"ఫో. అయితే." అంటూ మొహం తిప్పేసుకుంది రోజా. పెదవులు మాత్రం "ఆప్ జైసా కోయీ మేరే జిందగీమే ఆయేతో.." అంటూ అల్లరి చేస్తూనే వున్నాయి.

రెండు నిమిషాలు కుదురుగా కూర్చుందో లేదో మళ్ళీ ఓరగా తలత్రిప్పి ప్రియ వైపు చూసింది.

ఈలోకంలో లేనట్లుగా పని చేస్తోంది ప్రియ. ఒక చేత్తో పెన్సిల్ పట్టుకుని ప్రోగ్రామ్ కరెక్ట్ చేసుకుంటూ, మరో చేత్తో కంప్యూటర్ ఆపరేట్ చేస్తూ.. చూసేకొద్దీ చూడాలనిపించేలా వుంది.

ఎయిర్‌కండిషనర్ లోనుంచి విసురుగా వీస్తున్న చల్లటిగాలికి జుట్టు అందంగా ఎగురుతోంది. మెడని చుట్టుకుని వుండే లేత గులాబిరంగు చున్నీ ఒకప్రక్కకి జారిపోయి నేలమీద జీరాడుతోంది. అది వుండాల్సినచోట లేకపోవడంతో చుడీదార్ మీద వున్న అందమైన ఎంబ్రాయిడరీ కన్నుల పండుగ చేస్తోంది.

ఆమెనే తదేకంగా చూస్తూ రోజా అనుకుంది "ప్రియ అందంగా వుంటుందా! నేను అందంగా వుంటానా!" అని. అనుకుంటూనే మళ్ళీ యింకొకసారి ప్రియని పరీక్షగా, పరవశంగా చూసింది.

తను అనుకున్న రిజల్ట్ వచ్చిందేమో, ఎప్పటినుంచో కష్టపడుతున్న ప్రియ మొహంలో ఒక్కసారిగా రిలీఫ్ కనబడింది. ముందుకు వంగి ఫైనల్‌గా టెస్ట్ చేయసాగింది.

ఆమె ముందుకు వంగడంతో.. తీగెలా సాగిన వళ్ళు, నడుము దగ్గర మెలిక... యివే అద్భుతాలు అనుకుంటే, ఆ చుడీదార్‌కి వున్న లోనెక్ అంతకన్నా అద్భుతాలు చూపించింది.

అటే చూస్తున్న రోజాలో మళ్ళీ అల్లరి కట్టలు తెంచుకోవడంతో అప్రయత్నంగా అరిచింది. "ప్రియా! వాటే బ్యూటిఫుల్ షో అయామ్ సీయింగ్ యార్" అంటూ.

కరక్ట్‌గా వచ్చిన రిజల్ట్‌ని తృప్తిగా చూసుకుని, ఆ తర్వాత తాపీగా తలెత్తింది ప్రియ.

రోజా చూపులు ఎక్కడున్నాయో గమనించగానే, చున్నీ కంగారుగా గుండెలమీదికి లాక్కుని, ఎర్రబడ్డ బుగ్గలతో కసురుకుంది "ఏం చూశావే యిడియట్!" అని.

కన్నుగీటింది రోజా. "ఏం చూడలేదు అని అడుగు. దట్ విల్ బి ఈజీ టు సే"

మొహాన్ని తమాషాగా ముడిచి, పెదవులు బిగపట్టి అంది ప్రియ "సర్లే, నువ్వు లోనెక్ బ్లౌజ్ వేసుకురాకపోతావా, నేను చూడకపోతానా!"

ఆమె ఉక్రోషాన్ని మరింత పెంచుతూ బిగ్గరగా నవ్వేసింది రోజా. "నేను లోనెక్ బ్లౌజ్ వేసుకువస్తే కేర్‌ఫుల్‌గా వుంటానోయ్. నీలా షో చేయను." అంది.

కుర్చీని విసురుగా వెనక్కి తోసి లేచింది ప్రియ. "నిన్నూ.." అంటూ చేతిలోని పుస్తకంతో రోజా తలమీద ఒక్కటిచ్చింది.

"టాంగ్" అంటూ శబ్దం వచ్చింది.

ఊహించని శబ్దం వినబడడంతో యిద్దరూ అయోమయంగా ఒకళ్ళనొకళ్ళు చూసుకుని, అప్రయత్నంగా వెనక్కి తిరిగారు.
అంతే. ఇద్దరి మొహాలు కత్తివేటుకి నెత్తురు చుక్క లేకుండా పాలిపోయాయి.
అక్కడ.. వాళ్ళకి కేవలం పది అడుగుల దూరంలో నిలబడి వున్నాడు ఒకతను, కంప్యూటర్ బాగు చేస్తూ.
అతను వచ్చి చాలాసేపు అయినట్లుగా కంప్యూటర్ మొత్తం విప్పదీసి వుంది. అతని బ్రీఫ్‌కేస్‌లోని సామానంతా చిందరవందరగా టేబిల్ మీద పరుచుకుని వుంది.
వీళ్ళ కంగారుతో తనకి ఏమాత్రం సంబంధం లేనట్లూ, అతను తాపీగా వంగి క్రిందపడిన స్క్రూడ్రయివర్ తీసుకున్నాడు. పైకి లేచేటపుడు మాత్రం ఒక్కసారి వీళ్ళని చూసి చిన్నగా నవ్వాడు.
అమాయకంగానా! అపహాస్యంగానా! అల్లరిగానా!.. అర్థం కాలేదు యిద్దరికీ.
"ప్రియా! కమాన్" పెదవులు కదిలీకదలకుండా అని బయటకు నడిచింది రోజా.
బయటకి వస్తూనే అరిచేసింది. "ఏమిటే యిది! ఎవరతను! ఎప్పుడొచ్చాడంటావ్ లోపలికి!"
"ఇది మరీ బాగుంది. పనీ పాటా లేకుండా కూర్చుంది నువ్వా! నేనా! ఆమాత్రం ఎవరైనా వస్తున్నారేమో చూసుకుని మాట్లాడరూ!" కసురుకుంది ప్రియ.
"ఏమిటే చూసేది! ఈ టైమ్‌లో ఎవరైనా వస్తారని ఎలా అనుకుంటాం అసలు! అయినా వచ్చినవాడు తను వచ్చినట్లుగా తెలియచేయద్దూ! అలా చడీ చప్పుడూ లేకుండా కూర్చుని మన మాటలన్నీ వింటాడా! బాస్టర్డ్" పళ్ళు నూరింది రోజా.

అంతలోనే ఏదో గుర్తొచ్చిన దానిలా "రాజయ్యా!" అని కేక పెట్టింది.

"ఆ రూంలోకి వెళ్ళి మా బ్యాగ్స్ పట్టుకురా. ఆ కంప్యూటర్స్ ఆఫ్ చేసేయి." అని పురమాయించింది.

"ఎవరు రాజయ్యా అతను!" అనడిగింది ప్రియ.

"ఏవో మిషీన్లు పాడయినాయంటగదమ్మా. అవి బాగుచేయనీకి వచ్చిండు"

"ఇపుడు ఎందుకు వచ్చాడు! ఆఫీస్ టైమ్ అయిపోయాక."

సమాధానం తెలీనట్లూ రాజయ్య ఒక్కక్షణం తటపటాయించాడు. ఆ తర్వాత.. "ఏమోనమ్మా, ఆ సార్ రోజా యిదే టైంల వస్తడు" అనేసి లోపలికి వెళ్ళాడు.

రాజయ్య వెళ్ళిన వైపే తలలు త్రిప్పిన వాళ్ళిద్దరికీ దూరంగా అద్దాల వెనుకనుంచి అతను కనిపించాడు.

అతను.. ఏదో ప్రత్యేకత వుంది అతనిలో. చూడగానే చాలా మామూలుగా కనిపిస్తాడు. కానీ అంతలోనే చూపు త్రిప్పుకోలేనట్లుగా అనిపిస్తాడు. అందంగా లేడు కానీ ఆహ్లాదంగా వున్నాడు.

"కరెక్ట్. అదే అతని స్పెషాలిటీ. ప్లెసెంట్‌నెస్. చాలా హాయిగా, ఎంత కోపంలో వున్న వాళ్ళయినా కాసేపు అతన్ని చూస్తే చిరునవ్వు నవ్వేసేలా వున్నాడు.

"చాలా బాగున్నాడు కదా!" అతని వైపే తదేకంగా చూస్తున్న ప్రియ వులిక్కిపడింది, తన మనసులోని మాట రోజా నోటివెంట రావడంతో.

అంతకన్నా ఎక్కువగా ఏదో చెప్పాలనిపిస్తున్నట్లూ, చెప్పడం చేతకానట్లూ చూస్తూ "ఊ" అంది.

"ఇవిగోనమ్మా!" అన్న రాజయ్య మాటలకి యిద్దరూ ఈ లోకంలోకి వచ్చారు.

బ్యాగ్స్ తీసుకుని బయటకి నడిచారు.

ఆ కారిడార్ చివరికి వెళ్ళాక మాత్రం మళ్ళీ ఒక్కసారి తలలు త్రిప్పి అతన్ని చూడకుండా వుండలేకపోయారు.

బండి యివతలకి తీసి స్టార్ట్ చేస్తూ మరోసారి అంది రోజా "నిజంగా చాలా బాగున్నాడు కదే!" అని.

వెనకాల కూర్చుంటూ ప్రియ నవ్వింది "అతన్నేగా యిందాక బాస్టర్డ్ అని తిట్టావు!"

"అవును. అన్నాను. ఇప్పుడు కూడా అంటాను. బాస్టర్డ్" మళ్ళీ అంది రోజా. అయితే ఈసారి ఆమె గొంతులో కసి వుంది కానీ కోపం లేదు.

ఆరాత్రి ఎవరు ఎక్కువసేపు నిద్రలేకుండా గడిపారో తెలీదు. నిద్రపట్టబోయేముందు మాత్రం యిద్దరూ ఒకేమాట అనుకున్నారు "రేపు వస్తాడా అతను!" అని.

అతను వచ్చాడు. ఆ మర్నాడే కాదు. తర్వాత వారం రోజులపాటు వరుసగా వస్తూనే వున్నాడు.

రోజా వీళ్ళు ఆఫీసులోనుండి అడుగు బయటపెడుతూండగా అతను లోపలికి వచ్చేవాడు.

వీళ్ళని చూడగానే నవ్వేవాడు. అదే నవ్వు. అల్లరో, అమాయకత్వమో అర్థం కాని అందమైన నవ్వు.

వారం రోజుల తర్వాత..

లంచ్ టైమ్‌లో తాము యిద్దరే కూర్చుని వుండగా చెప్పింది రోజా రహస్యంగా "అతని పేరు ప్రమోద్‌ట. బాగుంది కదూ!" అని.

"ఎవరి పేరు?" అని అడగలేదు ప్రియ . వారం రోజులుగా వాళ్ళిద్దరి మనసులలో గూడు కట్టుకుని వున్నది ఎవరో, ఆలోచనలలో మెదుల్తూన్నది ఎవరో ఆమెకు తెలుసు.

"నీకెలా తెలిసింది?" అని మాత్రం అడిగింది.

"ఇందాక సునీత గారు చెప్తున్నారు. అయినా వాళ్ళకెందుకో అంత యింట్రస్ట్ అతని మీద!" రోజా మాటల్లో ఈర్ష్య ధ్వనించింది.

ప్రియ నవ్వింది. "మనకెందుకంటావ్ యింత యింట్రస్ట్!"

"చెప్పనా!" వెంటనే అడిగింది రోజా, ఆ ప్రశ్నకి తను అంతకుముందే సమాధానం ఆలోచించి పెట్టుకున్నట్లుగా.

ప్రియ తల వూపింది.

"ఆరోజు.. ఎవరూ లేరు కదా అని మనం ఫ్రీగా మాట్లాడుకోవడం.. ఆమాటలు అతను వినడం.. యిదంతా మనకి అతనంటే ఒకరకమైన చనువు కలిగించింది. అలాంటి మాటలు మనం మాట్లాడుకుంటుంటే అతను వినడం తల్చుకుంటే అతనేదో నగ్నంగా చూసేసిన ఫీలింగ్. కదూ!"

"చాల్లే. వూరుకో." మొహం ఎర్రగా కందిపోగా రోజా మాటల్ని కట్ చేసింది ప్రియ.

"కాదా చెప్పు!" రెట్టించింది రోజా. "అంత దగ్గరగా అనిపించబట్టే అతనిలో వున్న మామూలు అందం కూడా మనల్ని యింతగా ఆకర్షిస్తోంది. కాకపోతే వచ్చిన చిక్కేమిటంటే.. ఒకళ్ళం కాదు. ఇద్దరమూ ఆకర్షితులమైపోయాం. బొత్తిగా తెలుగు సినిమా అయిపోయిందోయ్. ఇపుడు త్యాగం చేయాల్సి వస్తే ఎవరం చేయాలంటావ్!" సీరియస్‌గా అడిగింది రోజా.

"సాయంత్రం అతన్ని రానీ. అడుగుదాం." అంతకన్నా సీరియస్‌గా చెప్పింది ప్రియ.

"అవును కదా! ఐడియా బాగుంది." హుషారుగా ఒప్పేసుకోబోయి అంతలోనే సంకోచంగా ఆగి అంది "కొంపదీసి అతను నాకిద్దరూ యిష్టం అంటే!"

ఒక్కక్షణం ఆలోచనలో పడ్డా వెంటనే సొల్యూషన్ చెప్పింది ప్రియ. "అప్పుడు షేర్ చేసుకుందాం లేటెస్ట్ తెలుగు సినిమా లాగా"

"ఓహెూహెూ ఏం చెప్పావే!" తమాషాగా అంది రోజా. "ఈ రోజేమిటీ నీ బుర్ర నా బుర్రని మించిపోయింది! ఆర్నెలలొకరి దగ్గరా, ఆర్నెలలొకరి దగ్గరా.. భారతంలో ద్రౌపదిలాగా మెయింటైన్ చేసుకోవచ్చు"
ఈ ధోరణిలో వాళ్ళిద్దరూ యింకెంతసేపు మాట్లాడేవారో కానీ యింతలో లంచ్ టైం అయిపోయినట్లుగా బెల్ మ్రోగింది.
ప్రియ లేచి తన కంప్యూటర్ దగ్గర కూర్చోబోతూ.. అప్పుడు చూసింది. ఎమ్.డి క్యాబిన్ తెరచి వుండడం.
"అదేమిటి! సార్ రూమ్ తలుపు తెరచి వుంచి లంచ్‌కి వెళ్ళారు!" ఆశ్చర్యంగా అడిగింది.
రోజా మొహంలో కూడా ఆశ్చర్యం తొంగి చూసింది. "అవును. అలా ఎప్పుడూ చేయరే!" అంటూ క్యాబిన్ దగ్గరకు వెళ్ళింది.
అంతే. ఆమె నోట్లోనుంచి అప్రయత్నంగా పెద్ద కేక వెలువడింది. అదిరిపడిన ప్రియ రెండంగలలో రోజాని చేరుకుంది.
అక్కడ.. ఆ రూమ్‌లో.. "అతను" కూర్చుని వున్నాడు. టేబిల్‌మీద మోచేతులు ఆనించి, చేతివేళ్ళన్నీ క్రాఫ్‌లో దూర్చేసుకుని, తల క్రిందికి వాల్చేసుకుని, అప్పటివరకూ తాము మాట్లాడిన మాటలన్నీ వింటూ..
రోజా అంత పెద్ద కేక పెట్టినా, అతనిలో కొంచెం కూడా తడబాటు లేదు. తాపీగా తల పైకెత్తి చూశాడు.
ఆవెంటనే చటుక్కున లేచి నిలబడి, టేబిల్ మీది బ్రీఫ్‌కేస్ అందుకుని బయటకి నడిచాడు.
తలుపు దగ్గర నిలబడ్డ వాళ్ళిద్దరూ, అతను తమ దగ్గరకి రాగానే అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేశారు.
అతను వాళ్ళని దాటి వెళ్ళబోతూ ఒక్క క్షణం ఆగాడు. ఏదో చెప్పాలనుకుంటున్నట్లుగా పెదవులు చిన్నగా కదిలాయి. మళ్ళీ అంతలోనే

మనసు మార్చుకున్నట్లుగా వెనక్కి తిరిగి, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

నిశ్శబ్దంగా వున్న ఆఫీసులోకి సందడి ఎప్పుడొచ్చిందో! శిలాప్రతిమల్లా నిలబడ్డ వాళ్ళిద్దరిలో చలనం ఎప్పుడొచ్చిందో!

కళ్ళముందు ఒకే దృశ్యం కనబడుతోంది. తమతో మాట్లాడేందుకు కూడా అసహ్యపడ్డవాడిలా తల విదిలించి, అతను వడివడిగా వెళ్ళిపోవడం.

తల్చుకుంటేనే సిగ్గుతో చచ్చిపోవాలనిపిస్తోంది.

మళ్ళీ అతని మొహం చూడటమెలా! అన్న ఆలోచనతో వచ్చిన సిగ్గు కాదది. ఆమాటకొస్తే, ఇక్కడ అతని వర్క్ అయిపోయిందనీ, ఇంక అతను ఈ ఆఫీసుకి వచ్చే అవసరం లేదనీ, ఆ అకౌంట్స్ సెటిల్ చేసుకోవడానికే.. ఎన్నడూ లేనిది ఆరోజు అతను పొద్దున పూట వచ్చాడనీ.. యిదంతా అతను వెళ్ళిన గంటకే తెలిసిపోయింది వాళ్ళిద్దరికీ.

కానీ అతను వెళ్ళిపోవడం.. ఆ దృశ్యం మాత్రం కొన్ని సంవత్సరాల వరకూ వెంటాడుతుందనిపిస్తోంది.

ఎందుకలా మాట్లాడారు తామిద్దరూ! ఆడపిల్లలు మాట్లాడకూడనంత అసహ్యంగా! అవును. ఆడపిల్లలు మాట్లాడాల్సిన మాటలు కావవి. ఇదేమాట యింకెవరైనా చెప్తే "ఏం! ఎందుకు మాట్లాడకూడదు?" అని వాదించే వాళ్ళేమో! కానీ యిపుడు తమ మనసే చెప్తుంటే యిక దానికి తిరుగేముంది!

నిజానికి తాము మాట్లాడిన మాటలన్నీ నాలుక చివరి మాటలే. వాటి అర్థమేమిటో కూడా మనసుకి సరిగా తట్టకుండా మాట్లాడిన మాటలు. కానీ ఎవరు నమ్ముతారు అలా చెప్తే! ఎవరో ఎందుకు! తామే నమ్మరు. ఏ వుద్దేశ్యమూ లేకుండా మనుషులు అలా మాట్లాడతారంటే తామే నమ్మరు.

"మనం యింకెపుడూ అలా మాట్లాడద్దు రోజా!" అంది ప్రియ. ఆమె గొంతులో లీలగా దుఃఖం కదలాడుతోంది.

రోజా తల వూపింది. "అతని గురించి కూడా యిక మనం ఎపుడూ తల్చుకోవద్దు" అంది.

ప్రియ ఉలిక్కిపడింది.

"అవును. జరిగినదేదో జరిగిపోయింది. మన జీవితంలో మనల్ని మొట్టమొదటిసారి ఆకర్షించిన వ్యక్తి అతను. ఎంతో ఆహ్లాదకరంగా మనసులో దాచుకోవలసిన ఆ విషయాన్ని మనం యింత అసహ్యం చేసుకున్నాం. ఇక దాన్ని గుర్తు పెట్టుకోవడం.. మళ్ళీ మళ్ళీ మాట్లాడుకోవడం.. యివన్నీ కూడా ఎందుకు? ఇంతటితో మర్చిపోదాం." రోజా చెప్తుంటే ప్రియ మాట్లాడలేదు.

ఆమెకు తెలుసు. రోజా ఒక నిర్ణయం తీసుకుందంటే యిక దానికి తిరుగుండదు.

ఇద్దరూ స్థిర నిశ్చయం చేసుకుని, ఆఫీసులో నుంచి బయటకి వచ్చారు. వాళ్ళతోపాటే బయటకి వచ్చిన సునీత వాళ్ళని చూసి నవ్వింది.

వాళ్ళు ఏ విషయం మర్చిపోవాలనుకున్నారో దాన్నే గుర్తు చేసింది. "పాపం! ప్రమోద్ యింక రాడుట గదండీ. మా తమ్ముడిని చూసినట్లే వుంటుంది నాకా అబ్బాయిని చూస్తే. పాపం! మంచి పిల్లాడు. ఇంజినీరింగ్ చదివాడట." ఆవిడ గొప్పగా చెప్తుంటే రోజా మొహం ఎర్రగా కందిపోయింది. ప్రియకి మాత్రం ఆవిడ అన్ని సార్లు " పాపం!" అని ఎందుకంటూందో అర్థం కాలేదు.

ఆగలేక అడిగేసింది "పాపం ఏంటండీ!" అని.

అడిగాకగానీ అర్థం కాలేదు ఆమెకి తన తప్పు.

అప్పటికే .. రౌద్రంగా చూస్తున్న రోజా "ఏదన్నా ఒక నిర్ణయం చేసుకుంటే దాన్ని కరెక్ట్‌గా పాటించాలి. లేకపోతే అసలు చేసుకోనే కూడదు." అనేసి విసురుగా వెళ్ళి బండి స్టార్ట్ చేసింది.

ప్రియ పరుగెత్తినట్లుగా వెళ్ళి వెనకాల కూర్చుంది.

తమవైపే నివ్వెరపోయి చూస్తున్న సునీత ప్రక్కనుంచి క్షణంలో కనుమరుగయిపోయిన వాళ్ళిద్దరికీ తెలీదు. తమ వెనకాల ఆమె "పాపం కాదా మరి! మూగవాడు, చెవిటివాడు అయ్యుండి కూడా యింజినీరింగ్ చదివాడంటే గొప్ప కాదూ!" అనుకుంటోందని.

అప్పుడే కాదు.. ఎప్పటికీ తెలీదు.

*****

("మయూరి" వీక్లీ - 05 మే 1995)